## Main, Meri Patni Aur Woh - by Chandan Aurora

Back

| | |
|---|---|
| Year Released | : 2005 |
| Language | : Hindi |
| Actors | : Rajpal Yadav, Kay Kay Menon, Rituparna Sen Gupta |
| Music Director | : Sanjay Jaipurwale |
| Director | : Chandan Arora |
| Reviewer | : SKU |
| Related Pages | : మీ అభిప్రాయాలు రచ్చబండ లో తెలియచేయండి |

ఈ పేజీని పంపండి

నేను సాధారణం గా నాకు నచ్చని సినిమాలు రివ్యూ చెయ్యాలన్న ఉత్సాహం కానీ చూడాలన్న కోరిక కానీ చూపను. అందుకే కాబోలు నేను రాసే ప్రతీ రివ్యూ లోనూ "నాకు నచ్చింది" అనే మాట చదివే జనాలకి బోర్ కొట్టకుండా ఏదో ఒక కొత్త విధంగా చెప్పాలని ఆశపడుతూ వుంటాను. ఇంక ఇవాళ చూసిన చిత్రం .. "Main Meri Patni Aur Woh". దీనిలో నటించింది రాజ్ పాల్ యాదవ్, దర్శకత్వం చందన్ అరోరా. వీళ్ళిద్దరి కాంబినేషన్ లో అదివరకు వచ్చిన "Main Madhuri Dixit Banna Chahti Hoon" చిత్రం లో కూడా రాజ్ పాల్ యాదవ్ నటన ఎంతో నచ్చింది. మరొక మధ్యతరగతి మనిషి కథ అని రివ్యూలలో ఈ చిత్రం గురించి చదివాను. కనుక ఇవాళ ఈ చిత్రం చూసాను. చూసాక నా అభిప్రాయం? "అద్భుతం!" అది చిత్రం గురించో, లేక రాజ్ పాల్ నటన గురించో, లేక దర్శకుడి టేస్ట్ గురించో చదవండి మరి!




చిత్ర కథ..

లక్నో యూనివర్శిటీ లో లైబ్రేరియన్ గా పని చేస్తున్న మిథిలేశ్ (రాజ్ పాల్ యాదవ్) ఒక ముదర బెండకాయ. కుటుంబ బాధ్యతల వలన పెళ్ళి వాయిదా పడి, ప్రస్తుతం ఇంక పిల్లని ఎవరు ఇస్తారులే అనే వైరాగ్యం. కానీ తల్లి బలవంతం మీద ఈడూ-జోడూ అయిన అమ్మాయి వీణ (రీతూపర్ణ సేన్

గుప్తా) తో పెళ్ళి చూపులకి అయిష్టం గానే బరేలీ వెళ్తారు. అక్కడ తన కన్నా కూసింత పొడవూ, చక్కటి అందం, చదువూ, చలాకీతనం వున్న వీణ ని చూసి మనసు పారేసుకుంటారు. ఆమె తనని నిరాకరిస్తారన్న నిశ్చయానికి వచ్చేసిన అతనికి ఆశ్చర్యం, ఆనందం కలగచేస్తూ ఆమె ఆ సంబంధానికి ఒప్పుకుంటారు. పెళ్ళి అయిపోతుంది. ఇంక అక్కడనుండీ మిథిలేశ్ కష్టాలు మొదలవుతాయి. కాకి ముక్కు దొండపండు లాంటి ఈ సంబంధం గురించి ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ తో వున్న మిథిలేశ్ వీణ తో మాట్లాడే ప్రతీ వ్యక్తినీ అనుమానించటం మొదలెడతారు. వాళ్ళని ఎలాగోలాగ వదిలించుకోవాలని చూస్తూవుంటారు. అలాంటీ పరిస్థితిలో వీణ స్నేహితుడూ, ఫారిన్ రిటర్న్ అయిన ఆకాశ్ (Kay Kay Menon) వచ్చి వీళ్ళ ఇంటి పక్కన దిగుతారు. వాళ్ళిద్దరి మధ్యా వున్న స్నేహాన్ని మిథిలేశ్ ఏ విధంగా అర్థం చేసుకున్నారు, ఎంత సేపు ఆ బాధ కడుపులో దాచుకోగలిగారు అనేది "Mein Meri Patni Aur Woh" చిత్రం లో చూడండి.

నటన..

రాజ్ పాల్ యాదవ్ నటన చెప్పాను కదా MMDBCH చిత్రలోనే ఎంతో నచ్చింది నాకు. ఈ చిత్రం లో కూడా ఒక మధ్యతరగతి మనిషి పాత్ర ని ఎంతో సహజంగా పోషించారు ఆయన. భగవంతుడితో తన కష్టాలు చెప్పుకోవటం అయినా, భార్య తో పరపురుషులు మాట్లాడుతుంటే అనుమానం తో రగిలిపోతున్నప్పుడు అయినా, ఆకాశ్ తో వీణ స్నేహాన్ని నిస్సహాయంగా చూడటమైనా, చివర్లో భార్య తో తన భయాలూ, అనుమానాలు పంచుకున్నప్పుడు అయినా ఎంతో నేచురల్ గా నటించారు. ఎక్కడా స్వరం పెంచటం కానీ, గొడవ చేయటం కానీ లేకుండా కూల్ గా నెమ్మదైన మనిషి గా చక్కగా సూట్ అయ్యారు. ఆయన భార్య వీణ గా రీతుపర్ణ సేన్ గుప్తా ని నేను చూడటం ఇదే మొదటిసారి. రాజ్ పాల్ వంటి నటుడి పక్కన తేలిపోకుండా నటించారు అంటే ఎంతో టేలెంట్ కల నటి అని ఒప్పుకోక తప్పదు. ఆమె పాత్ర కి పెద్దగా నటించటానికి అవకాశం లేకపోయినప్పటికీ, పాత్రోచితం గా చేసారు. చాలా అందం గా కూడా వున్నారు. ఆకాశ్ గా నటించిన Kay Kay Menon నా అభిమాన నటుల్లో ఒకరు. చాలా charming గా వున్నారు. ఆయనకి పెద్దగా నటించే అవకాశం వున్న పాత్ర కాదు. ఇతర పాత్రల్లో సలీమ్ గా నటించిన వరున్ బదోలా ది కొంచెం ప్రాధాన్యత వున్న పాత్ర. అంతా పాత్రోచితం గా నటించారు.

దర్శకత్వం..

కథ ని చాలా సింపుల్ గా నడిపించారు. ఎక్కడా సెంటిమెంట్ కోసం సృష్టించిన సన్నివేశాలు కానీ, భారీ డైలాగులు కానీ లేవు. చిత్రం ముగిసేసరికి మంచి చిత్రం చూసామన్న తృప్తి కలిగింది అంటే అది దర్శకుడి ప్రతిభ అనే అనాలి. చక్కటి సంభాషణలు, ప్రతిభావంతులైన నటీనటులు అంతా వుండటంతో చందన్ అరోరా పని సులభం అయింది. అవసరమైన చోట కొంచెం టిపికల్ ఫిల్మీ డైలాగులు వున్నప్పటికీ చాలా చోట్ల నేచురల్ గా చిత్రాన్ని మలిచారు. మిథిలేశ్ పాత్ర పరిచయం సీన్ లు చాలా బాగున్నాయి. అలాగే క్లైమాక్స్ ని కూడా చాలా సింపుల్ గా తీసారు. నాకు నచ్చింది. జనాలకి నచ్చలేదు అనుకుంటా అందుకే చిత్రం విజయం సాధించలేదు.

చక్కటి చిత్రం అని ముందు నుండీ తెలుసు. నా అంచనాలు ఏమాత్రం తప్పని చిత్రం ఇది. మంచి నటన, సింపుల్ కథనం కోసం ఈ చిత్రం చూడచ్చు.